
సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం ; 8 ; జూలై ; 2023



వైభవం..పుష్పయాగం
నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుష్పయాగం వైభవంగా జరిగింది. -8లో..



జెడ్పీలో కారుణ్య నియామకాలు
జిల్లా పరిషత్‌లో జూనియర్ సహాయకులుగా, ఆఫీసు సబార్డినేట్‌గా కారుణ్య నియామకాలు కల్పించారు. - 8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.920	రూ.1040
రెండోరకం	రూ.800	రూ.890

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 996 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

చెత్త సంపద కేంద్రం తనిఖీ



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా డీపీఓ ధనలక్ష్మి

రామాపురం: మండలంలోని సుద్దమళ్ల పంచాయతీ బయారెడ్డిగారిపల్లె గ్రామ సచివాలయాన్ని, చెత్త నుంచి సంపద కేంద్రాన్ని శుక్రవారం జిల్లా పంచాయతీ అధికారిణి(డీపీఓ) ధనలక్ష్మి సందర్శించారు. సచివాలయం సిబ్బంది పనితీరు గురించి కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కమలాదేవి, సిబ్బంది ధనుంజయరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్, తదితరులు పాల్గొన్నారు.

'మిట్స్'ను సందర్శించిన తైవాన్ వర్సిటీ డీన్లు



మిట్స్‌లో తైవాన్ యూనివర్సిటీ డీన్లు

కురబలకోట: కురబలకోట మండలం అంగళ్లులోని మదనపల్లె ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(మిట్స్)ను శుక్రవారం తైవాన్ యూనివర్సిటీకి చెందిన ఐదుగురు డీన్లు ఇంగ్ హహాయ్ చెన్, జియున్ జోంగ్, చింగ్ హీన్, చున్‌వీలిన్, చార్లెస్ సందర్శించారు. కళాశాల ఎక్స్‌లెన్స్ పెంచడానికి, ఇంటర్న్‌షిప్‌లు, సహకార కార్యకలాపాలు, ఎంఎస్ ప్రోగ్రామ్‌లు ఇతర పర్సువల్ సమగ్ర కార్యకలాపాల గురించి చర్చించారు. అనంతరం ప్రిన్సిపాల్ యువరాజ్ మాట్లాడుతూ తైవాన్ వర్సిటీ వారితో ఎంవోయు కుదుర్చుకున్నట్లు తెలిపారు.

11న బహిరంగ వేలం

చక్రాయపేట: గండి క్షేత్రంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో ఉన్న గదులను అద్దెకు ఇవ్వడానికి ఈనెల 11న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు.మొత్తం 44 గదులను రెండు సంవత్సరాల పాటు వ్యాపారులకు అద్దెకు ఇస్తామన్నారు.వేలంలో హిందువులు మాత్రమే పాల్గొనాలని చెప్పారు.

నేడు రిమ్స్‌కు వైఎస్సార్ హెల్త్ వర్సిటీ వీసీ

కడప అర్బన్: కడపలోని ప్రభుత్వ సర్వజన వైద్యకళాశాల (రిమ్స్)లో శనివారం వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ బాబ్జీ పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు రిమ్స్‌కు వచ్చి కళాశాలలో అన్ని విభాగాలు, ఆసుపత్రిలో ఐపీ, ఓపి విభాగాలలో తనిఖీలు చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ అధికారులు పాల్గొంటారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్: వైఎస్సార్ జిల్లా పరిధిలోని ఆర్టీసీ బస్టాండ్లలో ఖాళీగా ఉన్న 96 దుకాణాలకు ఐదు సంవత్సరాలు లీజుకు ఇచ్చేందుకు ఔత్సాహికులైన వ్యాపారవేత్తల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కడప డిపోలో 13, పులివెందుల 9, బద్వేలు 32, మైదుకూరు 17, జమ్మలమడుగు 20, ప్రొద్దుటూరులో 5 దుకాణాలకు టెండర్లను ఆహ్వానిస్తున్నామన్నారు. దరఖాస్తులను ఈనెల 18వ తేదీ వరకు ఆయా డిపోల్లో విక్రయిస్తారన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 19వ తేది మధ్యాహ్నం 2 గంటల్లోపు జిల్లా ప్రజా రవాణాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండరు బాక్సులో వేయాలన్నారు.

వెలుగుచూసిన శాసనాలు



కడప కల్చరల్: అన్నమయ్య జిల్లా నందలూరు పట్టణంలో రెండు శాసనాలను గుర్తించామని కేంద్ర పురావస్తుశాఖ డైరెక్టర్ ఆచార్య మునిరత్నం రెడ్డి తెలిపారు. గ్రామం మధ్యలో లభించిన రెండు రాతి స్తంభాలపై ఇరువైపులా 12వ శతాబ్దం నాటి లిపి ఉందన్నారు. రాతిపొరలు రాలిపోవడంతో కొద్దిమేర అక్షరాలు కనిపించడం లేదన్నారు. చెరువు సమీపంలోని దేవాలయం వద్ద గల ఈ శాసనాలపై దైవ సేవకుగాను గంధం, కొలతల సామగ్రిని ఆలయ సేవ నిమిత్తం అందించిన స్థానిక కుటుంబ సభ్యుల వివరాలున్నట్లు తెలిపారు. వీటిని కడప నగరానికి చెందిన రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ శైలేంద్రనాథ్ గుర్తించి తమకు ఫోటోలను అందజేశారని తెలిపారు.

అన్నదాత కలల పండుగ!

నేడు రైతు దినోత్సవం
- వైఎస్సార్ హయాంలో అభివృద్ధి, సంక్షేమ పాలన
- అదేబాటలో తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- అంతకుమించి సంక్షేమ పథకాల అమలు
- నేడు జిల్లా వ్యాప్తంగా రైతు బాంధవుడు వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు





సాక్షి ప్రతినిధి, కడప : ప్రజల సంక్షేమం, సమాజ అభివృద్ధే లక్ష్యంగా అహర్నిశలు పనిచేసిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను శనివారం జిల్లా వాసులు ఘనంగా నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి పీఠం అధిష్ఠించగానే అన్నదాతలకు ఉచిత విద్యుత్ అందించే ఫైలుపై తొలి సంతకం చేసిన డాక్టర్ వైఎస్సార్ రైతులు, కార్మికులతోపాటు అన్ని వర్గాల వారి అభ్యున్నతికి అహర్నిశలు పనిచేశారు. రైతులు బాగుంటే రాజ్యం బాగుంటుందని నమ్మి వ్యవసాయరంగం అభివృద్ధికి చర్యలు చేపట్టారు.2004లో ముఖ్యమంత్రి అయ్యాక అభివృద్ధిని పరుగులు పెట్టించారు. మునిసిపాలిటీగా ఉన్న కడపను కార్పొరేషన్‌గా, రాయచోటి, పులివెందుల, జమ్మలమడుగు, బద్వేలు, రాజంపేట మేజర్ పంచాయతీలను మున్సిపాలిటీలుగా మార్చారు. జిల్లాలో యోగి వేమన యూనివర్సిటీ, జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల, పశువైద్యవిద్య కళాశాలను నెలకొల్పారు. జిల్లా కేంద్రంలో రిమ్స్ వైద్య కళాశాల, 750 పడకల రిమ్స్ ఆస్పత్రి, దంత వైద్యకళాశాల నిర్మించారు. ట్రిపుల్ ఐటీ, ఐజీ కార్ల్ (పశు పరిశోధన కేంద్రం), దాల్మియా సిమెంటు కర్మాగారం, గోవిందరాజా స్పిన్నింగ్ మిల్స్, భారతి సిమెంటు కర్మాగారం, సజ్జల పాలిమర్స్ లాంటి పరిశ్రమలను నెలకొల్పారు. సుమారు రూ.12 వేల కోట్లతో జలయజ్ఞంలో భాగంగా గాలేరు–నగరి సుజల స్రవంతి, గండికోట కెనాల్, టన్నల్, గండికోట వరద కాల్వ, గండికోట ఎత్తిపోతల పథకాలు వైఎస్సార్ హయాంలో రూపొందించినవే. మైలవరం ఆధునికీకరణ, సర్వరాయసాగర్, వామికొండ ప్రాజెక్టు, సీబీఆర్, పీబీసీ, పైడిపాళెం, వెలిగల్లు, తెలుగుగంగ ప్రాజెక్టు పనులు చకచకా సాగించారు. అధికారంలోకి వచ్చిన మరుసటి ఏడాదే తెలుగుగంగ పనులను పూర్తి చేసి కృష్ణా జలాలతో బ్రహ్మంసాగర్‌ను నింపి ఆయకట్టుకు ఏఐసీసీ అధ్యక్షురాలు సోనియాగాంధీ చేతుల మీదుగా నీటిని విడుదల చేయించారు. జిల్లాలో విశాలమైన రోడ్లు వేయించారు. ఎవరు ఏది అడిగినా కాదనకుండా పనిచేసిన నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జిల్లాలో అభివృద్ధి పథకాలతోపాటు సంక్షేమ పథకాలను విస్తృతంగా అమలు చేశారు.

నేడు జిల్లాలో వైఎస్సార్ జయంతి వేడుకలు

శనివారం దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు పార్టీలకతీతంగా సిద్ధమయ్యారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ కుటుంబ సభ్యులు ఇడుపులపాయలోని వైఎస్సార్‌ఘాట్‌లో దివంగత నేతకు నివాళులర్పించనున్నారు. ప్రత్యేక ప్రార్థనలు చేపట్టనున్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాలకు పాలాభిషేకాలు, వివిధ ఆస్పత్రులల్లో రోగులకు సేవా కార్యక్రమాలు, రక్తదాన కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, నేతలు, పార్టీ శ్రేణులు, అభిమానులు ఈ కార్యక్రమాల్లో పాల్గొనున్నారు.



తండ్రి బాటలో తనయుడు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి జయంతిని రైతు దినోత్సవంగా నిర్వహిస్తూ అదేబాటలో పయనిస్తున్నారు. ప్రజల సంక్షేమం కోసం నాన్నగారు ఒక అడుగు ముందుకు వేస్తే నేను రెండు అడుగులు ముందుకు వేస్తానని ప్రకటించి, తూచ తప్పకుండా నాలుగేళ్లగా నాలుగు అడుగులు ముందుకు వేశారు. బీడు భూములకు సాగునీరు అందించే లక్ష్యంతో సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్ పనులను పూర్తి చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. అక్కడే రైతులకు విత్తనాలు, ఎరువులు, పనిముట్లను అందజేస్తున్నారు. వ్యవసాయ పరమైన అన్ని ప్రభుత్వ కార్యక్రమాలను రైతుల ముంగిట్లోకి తెచ్చారు. రైతులకు పెట్టుబడి సాయంగా రైతు భరోసా ద్వారా జిల్లాలో 2019–20లో 2,06,708 మంది రైతులకు రూ.279.93 కోట్లు, 2020–21లో 2,08,747 మందికి రూ.280 కోట్లు,2021–22లో 1,99,344 మందికి రూ.269.11 కోట్లు అందించారు. అలాగే 2022–23 ఏడాదిలో 1,90,074 మంది రైతులకు రూ.192.96 కోట్లు మొత్తంగా జిల్లాలోని రైతులకు రూ.1,022 కోట్లు అందజేశారు. భూములు లేని ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులకు సైతం ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తోంది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయిన ఉద్యాన, వ్యవసాయ రైతులను ఆదుకునేందుకు డాక్టర్ వైఎస్సార్ పంటల బీమా అమలు చేస్తున్నారు. బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఇప్పటి వరకూ జిల్లాలోని 3,80,475 మంది రైతులకు రూ.1,063.22 కోట్లు బీమా వర్తించింది. జిల్లాలో ఖరీఫ్, రబీలలో కొనుగోలు కేంద్రాల ద్వారా గిట్టుబాటు ధర కల్పించి రైతులు పండించిన పంటలను కొనుగోలు చేస్తున్నారు. రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు స్థానికంగానే అందిస్తున్నారు. రైతులకు అవసరమైన అన్ని పథకాలను ప్రభుత్వం అమలు చేస్తూ రైతు రాజ్యాన్ని నెలకొల్పారు. రైతులతోపాటు అన్నీ వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేశారు. మరోవైపు జిల్లా సమగ్రాభివృద్ధి కోసం విశేష కృషి చేస్తున్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూనే పెద్ద ఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. తద్వారా నిరుద్యోగ చదువుకున్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నారు. మొత్తంగా రాజన్న రాజ్యాన్ని మరిపించే రీతిలో సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందడుగు వేస్తోంది.

మా ఊపిరి మీరే..

సాక్షి ప్రతినిధి, కడప: దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు ఇప్పటికీ, ఎప్పటికీ మరువరానివి. కన్నీటి బతుకుల్లో చిరునవ్వుల పువ్వులు విరబూయించిన మీరే మా ఊపిరి అంటూ లబ్ధిదారులు ఇప్పటికీ ఆయనను తలుచుకుని కన్నీటిపర్యంతమవుతున్నారు.



"ఇతని పేరు యువ కిశోర్. కురబలకోట మండలంలోని ఇందిరాపురం. ఆదిమూర్తి, నాగరత్న తల్లిదండ్రులు. ఇతను ఒకటిన్నర సంవత్సరం వయస్సులో ఇంటి వద్ద ఆడుకుంటుండగా కింద పడ్డాడు. చెవుల్లో రక్తం వచ్చింది. అప్పటి నుంచి మాట కరువైంది. మూగతో పాటు చెవుడు తోడైంది. తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న తరుణంలో 2008లో ఆనాటి సీఎం వైఎస్ఆర్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం ద్వారా హైదరాబాదు అపోలో ఆసుపత్రిలో రూ.6 లక్షలతో ఆపరేషన్ చేశారు. తలలో చిప్ అమర్చారు. దీంతో యువకిశోర్ మొదటి సారిగా అమ్మా..నాన్న అన్నాడు. ఆపరేషన్ తర్వాత బడికి వెళ్లాడు. పాత మిషన్ పనిచేయకుండా అగిపోవడంతో వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఇతనికి కొత్తగా రూ.5 లక్షల వ్యయంతో మరో కాక్లియర్ ఇన్‌ప్లాంటేషన్ మిషన్ అందజేశారు. వైఎస్ కుటుంబ చొరవతో తమ బిడ్డకు మాట వచ్చిందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.



కురబలకోట మండలం లోని అంగళ్లుకు చెందిన బి క్రిష్టారెడ్డికి రవితేజరెడ్డి ఒక్కడే కుమారుడు. ఇతను మూడో తరగతి చదువుతున్నప్పుడు హుషారు లేకుండా నలతగా ఉండేవాడు. వివిధ ఆసుపత్రిలో చూపించారు. పరీక్షలు చేసి డాక్టర్లు రవి తేజరెడ్డికి గుండె నరాలు దెబ్బతిన్నా యని ఆపై గుండె ఎదుగుదల సక్రమంగా లేదని వెల్లడించారు. ఇలాంటి తరుణంలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఆపరేషన్ చేశారు. వైఎస్సార్ భిక్షే తన బిడ్డ పునర్జన్మకు కారణమైందని క్రిష్టారెడ్డి చెబుతున్నారు."

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



అధికారులతో చర్చిస్తున్న జిల్లా కలెక్టర్ విజయరామరాజు



భద్రతా ఏర్పాట్ల గురించి సూచనలు ఇస్తున్న జిల్లా ఎస్పీ అన్బురాజన్

పులివెందుల : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 9వ తేదీన పులివెందులలో పర్యటించనున్న నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ విజయరామరాజు, జిల్లా ఎస్పీ అన్బురాజన్ శుక్రవారం పరిశీలించారు. ముందుగా కలెక్టర్ సీఎం పర్యటించే ప్రాంతాలైన మున్సిపల్ కార్యాలయం, నగరవనం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు, సలహాలు అందించారు. కలెక్టర్‌తోపాటు పులివెందుల ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలు కూడా ఆయా ప్రాంతాలలో పర్యటించారు. అలాగే జిల్లా ఎస్పీ అన్బురాజన్ ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాల్లో రిహార్సల్స్ నిర్వహించారు. ప్రొద్దుటూరు ఏఎస్పీ ప్రేర్ణా కుమార్, అడిషనల్ ఎస్పీ తుషార్ డూడీ, పులివెందుల డీఎస్పీ వినోద్‌కుమార్, సీఐ రాజులతోపాటు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సమర్థవంతంగా బందోబస్తు విధులు చేపట్టండి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటన నేపథ్యంలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా బందోబస్తు విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ అన్బురాజన్ పేర్కొన్నారు. బందోబస్తు విధుల్లో పాల్గొనే హోంగార్డులు, పోలీసు ఉన్నతాధికారులతో శుక్రవారం పులివెందులలోని సీఎస్ఐ మైదానంలో సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.వి.కృష్ణారావు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యేలు

జమ్మలమడుగు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గండికోట పర్యటన సందర్భంగా జరుగుతున్న ఏర్పాట్లను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి పరిశీలించారు. శుక్రవారం ఉదయం ఒబెరాయ్ హోటల్స్ నిర్మాణ ప్రాంతంలో బందోబస్తు ఏర్పాట్లపై డీఎస్పీ నాగరాజు, సీఐ సదాశివయ్యలతో చర్చించారు. ఆదివారం ఉదయం 9 గంటలకు ఇడుపులపాయ నుంచి గండికోట సమీపంలో ఒబెరాయ్ నిర్మిస్తున్న విల్లాల నిర్మాణాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేస్తారు. అనంతరం గండికోటలోయ వ్యూ పాయింట్‌లను పరిశీలిస్తారు.కార్యక్రమంలో హార్టికల్చర్ రాష్ట్ర సలహా మండలి కమిటీ చైర్మన్ సంబటూరు ప్రసాద్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడుపోరెడ్డి మహేశ్వరరెడ్డి, హనుమంతరెడ్డి, హృషికేశవరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.



సభావేదిక పనులను పరిశీలిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నేటి సీఎం పర్యటన వివరాలు

కడప సెవెన్‌రోడ్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేటి నుంచి జిల్లాలో పర్యటించనున్నారు. నేటి పర్యటన వివరాలివి..


- మధ్యాహ్నం 1.30 గంటలకు కల్యాణదుర్గంలో బయలుదేరి 1.55 గంటలకు ఇడుపులపాయ హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 2.05 గంటలకు వైఎస్సార్ ఘాట్ వద్దకు వెళతారు.
- 2.25 గంటల వరకు అక్కడ జరిగే ప్రార్థనల్లో పాల్గొంటారు. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికి నివాళులర్పిస్తారు.
- 2.25 గంటలకు ఘాట్ నుంచి బయలుదేరి ప్రేయర్ హాలుకు 2.30 గంటలకు చేరుకుంటారు.
- 5.30 గంటల వరకు సింహాద్రిపురం మండల ప్రజా ప్రతినిధులతో సమావేశమవుతారు.
- 5.35కు హెచ్‌సీఎం రెసిడెన్స్‌కు చేరుకుంటారు.

రాజీవ్ పార్కు రాజసం





వైఎస్సార్ జిల్లా కడప నగరంలో నూతనంగా రూపుదిద్దుకున్న రాజీవ్ పార్కులో రాజసం ఉట్టిపడుతోంది. 1.50 కోట్లతో ఆధునికీకరించిన ఈ పార్కులో పిల్లలు ఆడుకోవడానికి అన్ని ఆట పరికరాలు, వ్యాయామం చేయడానికి జిమ్, సాయంత్రవేళ వాకింగ్ చేయడానికి నడకదారులు, సేదతీరడానికి, ఫంక్షన్లు చేసుకోవడానికి వేదికలు అత్యద్భుతంగా తీర్చిదిద్దారు. మరోవైపు రాజీవ్‌మార్గ్‌ను విశాలంగా విస్తరించి రహదారులు, ఫుట్‌పాత్‌లు ఏర్పాటు చేశారు. అలాగే సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయడంతో రాజీవ్ పార్కు ఎల్ఈడీ వెలుతురులో కాంతులీనుతోంది. ఈనెల 10న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా పార్కు ప్రారంభం కానుంది.
–సాక్షి ఫొటోగ్రాఫర్, కడప



కర్షకా బీమానం

- గత ఏడాది ఖరీఫ్‌కు వైఎస్సార్ పంటలబీమా విడుదల
- జిల్లాలో 48,780 మంది రైతులకు రూ.98.94 కోట్లు లబ్ధి
- నేడు రైతు ఖాతాల్లో జమ చేయనున్న ప్రభుత్వం

సాక్షి రాయచోటి : రాష్ట్రంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్ల నుంచే అన్నదాతలకు పెద్దపీట వేస్తోంది. పంట పెట్టినప్పటినుంచి నష్టం వరకు...పెట్టుబడి నుంచి బీమా ప్రీమియం వరకు అన్నీ ప్రభుత్వమే భరిస్తోంది. ప్రకృతి విపత్తులతో పంటలు నష్టపోతున్న వారికి కష్టకాలంలో తోడుగా నిలుస్తోంది. సీజన్ ముగిసేలోపే ఈ సీజన్‌కు సంబంధించిన బీమా అందిస్తోంది. రైతుల సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా ముందుకు సాగుతోంది.

జిల్లాలో 48,780 మంది రైతులకు రూ. 98.94 కోట్లు

2022 ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా అనేక రకాల పంటలను రైతులు సాగు చేశారు. ప్రధానంగా వరి, కంది, వేరుశనగ, టమోటా, జొన్న, పత్తి, ఇలా అనేక రకాల పంటలను సాగు చేశారు. రైతులకు సంబంధించి అధికంగా వేరుశనగ, టమోట, పంట దిగుబడి తగ్గిపోయిన నేపథ్యంలో రైతులకు ఈ–క్రాప్ నివేదికల ద్వారా నష్టపోయిన వ్యవహారాన్ని గుర్తించిన ప్రభుత్వం బీమా సొమ్మును విడుదల చేస్తోంది. ఇప్పటికే రైతులకు సంబంధించిన జాబితాలను ఆర్బీకేల ద్వారా తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా



63,853 హెక్టార్లలో పంట నష్టపోయిన 48,780 మంది రైతులకు రూ. 98943853 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వాటికి సంబంధించి రైతులకు సొమ్ములు ఖాతాలకు జమ చేయనున్నారు.

ప్రకృతి గాయానికి పరిహారం

అన్నమయ్య జిల్లాలోని అన్నదాతలను ప్రకృతి ఏదో ఒక రూపంలో దెబ్బతీస్తోంది. ఒకసారి వడగండ్ల వాన, మరొకసారి పెనుగాలులతో బీభత్సం సృష్టిస్తోంది. 2023 మార్చి, ఏప్రిల్ నెలల్లో పండ్లతోటలు, వ్యవసాయ పంటలు కూడా దెబ్బతిన్నాయి. 2023 ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో సుమారు 1344 మంది రైతులకు సంబంధించి రూ. 179.16 కోట్ల మేర నష్టం వాటిల్లడంతో ప్రభుత్వం జూన్ 1న తేదీన పరిహారం అందించింది. ఇలా పంట నష్టపోయిన ప్రతిసారీ ఆలస్యం లేకుండా వెంటనే రైతులను ఆదుకుంటూ భరోసా నింపుతోంది.

బీమా సొమ్ము పంపిణీకి ఏర్పాట్లు

అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని నారాయణ కల్యాణ మండపంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారులు గతేడాది ఖరీఫ్‌కు సంబంధించి బీమా సొమ్ముల పంపిణీకి సంబంధించి సదస్సు నిర్వహించనున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం అనంతపురం జిల్లా కల్యాణదుర్గం సభలో బీమా సొమ్ములు విడుదల చేయగానే జిల్లాలో లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేయనున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 400 మందికి పైగా రైతులు హాజరు కానున్న తరుణంలో అందుకు తగ్గట్టుగా జిల్లా వ్యవసాయశాఖ ఏర్పాట్లు చేస్తోంది.

నియోజకవర్గం	రైతులు	ఎకరాలు	మంజూరైన బీమా
పీలేరు	7224	10012,32	82,35,603
మదనపల్లె	8315	8831	75,66,346
తంబళ్లపల్లె	28448	38259.6	7,31,37,487
రాజంపేట	1283	1780.1	26,67,334
రాయచోటి	3494	4956.1	73,17,356
రైల్వేకోడూరు	16	14.15	19,727
మొత్తం	48780	63853.35	9,89,43,853

రైతులను ఆదుకుంటున్న ప్రభుత్వం



ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటోంది. ఈసారి కూడా సుమారు 48 వేల మందికి పైగా రైతులకు రూ. 98 కోట్ల మేర బీమా సొమ్ములను ప్రభుత్వం విడుదల చేస్తోంది. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో పెనుగాలులకు దెబ్బతిన్న పండ్ల తోటల రైతులకు కూడా ప్రభుత్వం పరిహారం అందించింది. సీఎం వైఎస్ జగన్ నిధులు విడుదల చేయగానే రైతుల ఖాతాలకు జమ చేసేలా చర్యలు తీసుకుంటున్నాం.
– పీఎస్ గిరీషా, జిల్లా కలెక్టర్, అన్నమయ్య జిల్లా

క్లుప్తంగా

సోషల్ మీడియాలో అసత్య ప్రచారం

- ఇద్దరు చిన్నారులను పీలేరు వాసులుగా పేర్కొంటూ వైరల్ అయిన వీడియో

పీలేరు రూరల్ : తప్పిపోయిన ఇద్దరు చిన్నారులు తమది పీలేరు అని పేర్కొంటున్నారని సోషల్ మీడియాలో అసత్య ప్రచారం జరిగింది. ఈ విషయమై సీఐ మోహన్‌రెడ్డి శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. నంద్యాల జిల్లా డోన్ రైల్వేస్టేషన్‌లో ఈ చిన్నారులు ఉన్నారని, ఈ సమాచారాన్ని వాట్సాప్ గ్రూప్‌లలో షేర్ చేయాలని ఓ వీడియో వైరల్ అయిందని తెలిపారు. దీనిపైన విచారణ చేశామని చెప్పారు. స్థానికంగా గ్రామ వలంటీర్లు, మహిళా పోలీసులు, పోలీస్ సిబ్బందితో విస్తృతంగా ఆరా తీసినట్లు తెలిపారు. అలాగే డోన్‌లో పోలీస్, రైల్వే పోలీస్‌లతో వదంతులపై వివరణ కోరగా.. అంతా ఫేక్ సమాచారం అని తెలిసిందన్నారు. పిల్లలు ఎవరూ తమ వద్ద లేరని రైల్వే అధికారులు తెలిపినట్లు చెప్పారు.

కువైట్‌లో మండల వాసి మృతి



కరీముల్లా(ఫైల్)

ఓబులవారిపల్లె : కువైట్‌లో శుక్రవారం తెల్లవారుజామున మండలానికి చెందిన సయ్యద్ కరీముల్లా(44) గుండెపోటుతో మృతి చెందాడు. ముక్కావారిపల్లె తురకపల్లె గ్రామానికి చెందిన సయ్యద్ ఆమీర్ సాహెబ్ కుమారుడు కరీముల్లా 20 ఏళ్లుగా జీవనోపాధి కోసం కువైట్ దేశానికి వెళ్తూ వస్తున్నాడు. గురువారం రాత్రి స్నేహితులతో కలిసి భోజనం చేసి నిద్రపోయాడు. నిద్రలోనే గుండె పోటుతో మృతి చెందాడు. మృతుడి భార్య నసీరున్ శ్రీకాళహస్తి సచివాలయంలో పని చేస్తోంది. ఇద్దరు కుమారులు, ఒక కుమారుడు ఉన్నారు. కువైట్ నుంచి ఆదివారం స్వదేశానికి మృతదేహాన్ని తరలించనున్నారు.

అటవీ ప్రాంతం తనిఖీ

సిద్దవటం : సిద్దవటం రేంజి పరిధిలోని కొండూరు మద్దూరు, సిద్దవటం బీట్లలో శుక్రవారం సిద్దవటం రేంజర్ బి.కళావతి, సిబ్బందితో వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ గతంలో ఎర్రచందనం అక్రమ రవాణా జరిగిన సమస్యాత్మక అటవీ ప్రదేశాలను తనిఖీ చేశామన్నారు. ఎర్రచందనం స్మగ్లర్ల కదలికలు, వన్యప్రాణుల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామన్నారు. అటవీ ప్రాంతం మరింత పచ్చదనంగా ఉండేందుకు మొక్కలను నాటడం జరుతుందన్నారు. కార్యక్రమంలో ఫారెస్టుసెక్షన్ ఆఫీసర్ సురేష్‌బాబు, ఎఫ్‌బీఓలు విశ్వనాథరెడ్డి, మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు

దువ్వూరు : మండల పరిధిలోని పాత దువ్వూరు ఆంజనేయస్వామి దేవాలయం వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రెండు బైక్‌లు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. దువ్వూరు మండలం వెంకుపల్లె గ్రామానికి చెందిన దస్తగిరి తన స్వగ్రామం నుంచి దువ్వూరుకు బైక్‌పై వస్తుండగా, దువ్వూరు నుంచి చాగలమర్రికి వెళుతున్న మరొక బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో దస్తగిరి తీవ్రంగా గాయపడగా, మరో బైక్‌లో ప్రయాణిస్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన దస్తగిరి పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

జెడ్పీలో కారుణ్య నియామకాలు

- ఏడుగురు ఉద్యోగులకు పదోన్నతి
- పత్రాలు అందజేసిన జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి



జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డిని సత్కరిస్తున్న ఉద్యోగులు

కడప సెవెన్‌రోడ్స్ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని పురస్కరించుకుని జిల్లా పరిషత్‌లో జూనియర్ సహాయకులుగా, ఆఫీసు సబార్డినేట్‌గా కారుణ్య నియామకాలు కల్పించారు. శుక్రవారం జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి వీరికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు పొందిన వారు తమ కుటుంబాలకు ఆసరాగా నిలవాలని సూచించారు. కుటుంబ సభ్యులకు ఉపయోగపడుతూ మరోవైపు ఉద్యోగ విధులను నిబద్ధతతో నిర్వర్తించాలన్నారు. జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలకు సంబంధించిన ఫైళ్లు ఆలస్యం లేకుండా క్లియర్ చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా కారుణ్య నియామకాలకు తొలి ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.

పదోన్నతులు

జూనియర్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న ఏడుగురికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించి వివిధ ప్రాంతాలకు బదిలీ చేసినట్లు జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి తెలిపారు. వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. అంకాలమ్మ గూడూరులో పని చేస్తున్న ఎస్.రాంప్రతాప్‌ను బి.మఠం ఎంపీపీ కార్యాలయానికి బదిలీ చేశారు. కలసపాడు ఎంపీపీలో ఉన్న బి.గుర్రప్పను బి.కోడూరుకు, వల్లూరు ఎంపీపీలో ఉన్న వి.చంద్రకళను కడప జెడ్పీకి, కడప డీఎండబ్ల్యూఓ కార్యాలయంలో పని చేస్తున్న ఎస్.కరీముల్లాను చెన్నూరు ఎంపీపీకి, బద్వేలు ఎంపీపీలో పని చేస్తున్న ఓ.శారదమ్మను అక్కడే నియమించారు. ఎర్రగుంట్ల ఎంపీపీలో పని చేస్తున్న పి.శేఖర్‌ను జమ్మలమడుగు, వేంపల్లె జెడ్పీ హైస్కూలులో పని చేస్తున్న బి.రఘునాథరెడ్డిని పులివెందులకు బదిలీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ ఉపాధ్యక్షులు బాలయ్య, జెడ్పీ డిప్యూటీ సీఈఓ రమణారెడ్డి, ఏఓ రంగాచార్యులు, పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.నాగిరెడ్డి, జిల్లా అధ్యక్షులు లంకా మల్లేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటిని వారు ఘనంగా సత్కరించారు.

ఏపీని దేశానికి అన్నపూర్ణగా తీర్చిదిద్దిన వైఎస్సార్



వైఎస్సార్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎంవీఎస్ నాగిరెడ్డి

కడప అగ్రికల్చర్ : ఆంధ్రప్రదేశ్‌ను భారతదేశానికి అన్నపూర్ణగా తీర్చిదిద్దిన ఘనత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి దక్కుతుందని ఏపీ స్టేట్ అగ్రికల్చర్ మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి అన్నారు. శుక్రవారం కడపలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో రాష్ట్ర వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డిలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైఎస్సార్ తన ఐదేళ్ల మూడు నెలల పాలనలో ప్రజలు, రైతులకు అందించిన సేవలు, సంక్షేమ పథకాలకు గుర్తుగా జూలై 8వ తేదీని రైతు దినోత్సవంగా జరుపుకొంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా వ్యవసాయశాఖ అడ్వయిజరీబోర్డు చైర్మన్ భరత్‌రెడ్డి, నెల్లూరు జిల్లా వైఎస్సార్‌పార్టీ నాయకులు శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌కు ఘన నివాళి

వేంపల్లె : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి వ్యవసాయ మిషన్ రాష్ట్ర వైస్ చైర్మన్ ఎం.ఎస్.నాగిరెడ్డి ఘనంగా నివాళులర్పించారు. నేడు శనివారం రైతు దినోత్సవం సందర్భంగా ఆయన ఇడుపులపాయకు చేరుకున్నారు. అనంతరం వైఎస్సార్ ఘాట్‌కు చేరుకుని దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అక్కడే ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పుష్పగుచ్ఛం ఉంచి నమస్కరించుకున్నారు.

ఇడుపులపాయ చేరుకున్న వైఎస్ విజయమ్మ, షర్మిల



వేంపల్లెలో కుటుంబ సభ్యులతో వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల

వేంపల్లె : ఈ నెల 8న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా వైఎస్సార్ సతీమణి వైఎస్ విజయమ్మ, కుమార్తె, వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల, కుటుంబ సభ్యులు అంజలి, రాజారెడ్డిలు శుక్రవారం ఇడుపులపాయ చేరుకున్నారు. షర్మిల సాయంత్రం 4.30గంటలకు కడప ఎయిర్ పోర్ట్ నుంచి రోడ్డు మార్గాన ఇడుపులపాయలోని వైఎస్సార్ గెస్ట్‌హౌస్‌కు చేరుకున్నారు. అంతకుమునుపే వైఎస్ విజయమ్మ వచ్చారు. నేడు (శనివారం) వైఎస్సార్ జయంతి సందర్భంగా వారు కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం 7.30గంటలకు వైఎస్సార్ ఘాట్‌కు చేరుకుని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సమాధి వద్ద నివాళులర్పించనున్నారు. కార్యక్రమంలో వేంపల్లె జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఆర్‌ఎల్వీ ప్రసాద్‌రెడ్డి, బంకా సోమేశ్వర రెడ్డి, రామగంగిరెడ్డి, శ్రీనివాసులు, ఎస్టేట్ మేనేజర్ భాస్కరరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో రక్తదాన శిబిరం

ముందస్తుగా వైఎస్సార్ జయంతి వేడుకలు



రక్తదానం చేసిన సిబ్బందిని అభినందిస్తున్న వీసీ, రిజిస్ట్రార్

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 74వ జయంతి వేడుకలు ముందస్తుగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని వైస్ చాన్సలర్ ఆచార్య బి.అంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టి పేదప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నారన్నారు. ఆయన మనమధ్య భౌతికంగా లేకపోయినా మనందరి మనసులో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. విశ్వవిద్యాలయానికి డాక్టర్ వైఎస్ఆర్ పేరు పెట్టడం సంతోషంగా ఉందన్నారు. ఈయన జయంతి పురస్కరించుకుని సిబ్బంది రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం 50 మందిపైగా అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

రైల్వేకోడూరు : తిరుపతి జిల్లా కరకంబాడి దొడ్లమిట్టకు చెందిన నీలకంఠం రాజు హత్య కేసులో నిందితుడు రైల్వేకోడూరు మండలం మాధవరంపోడుకు చెందిన గూడూరు సుబ్రమణ్యం రాజును అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. 2022 ఏప్రిల్ 9న రాత్రి 9.30 గంటల సమయంలో మాధవరంపోడు గ్రామంలో ఆస్తి విషయంలో గూడూరు సుబ్రమణ్యం రాజు, అతని వదిన పుష్పలత గొడవపడ్డారని తెలిపారు. ఈ విషయంలో మాట్లాడటానికి వచ్చిన పుష్పలత అన్న నీలకంఠం రాజును గూడూరు సుబ్రమణ్యంరాజు, అతని భార్య ఇద్దరు కలిసి తలపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయాలయినట్లు పేర్కొన్నారు. కొట్టిన గాయాల నుంచి కోలుకోలేక 2022 జూన్ 6న తిరుపతి జిల్లా కరకంబాడి దొడ్లమిట్టలోని తన ఇంట్లోనే చనిపోయినట్లు చెప్పారు. నీలకంఠంరాజు తండ్రి అనంతరాజు కోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. పరారీలో ఉన్న గూడూరు సుబ్రమణ్యం రాజును గురువారం రాత్రి రైల్వేకోడూరు మండలం అనంతరాజుపేట జెట్పీహైస్కూల్ వద్ద అరెస్ట్ చేసినట్లు చెప్పారు. శుక్రవారం కోడూరు కోర్టులో హాజరు పరచగా మేజిస్ట్రేట్ రిమాండు విధించినట్లు వివరించారు.

బైక్‌ల చోరీ కేసులో రెండేళ్ల జైలు శిక్ష



నిందితులను కోర్టుకు తీసుకొచ్చిన పోలీసులు

మదనపల్లె : పట్టణంలో ద్విచక్రవాహనాల చోరీకి పాల్పడిన ఇద్దరికి రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ మదనపల్లె రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఇంటూరి ప్రవీణ్‌కుమార్ శుక్రవారం తీర్పు చెప్పారు. ఈ విషయమై టూటౌన్ సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ద్విచక్రవాహనాల చోరీ కేసుకు సంబంధించి క్రైమ్ నంబర్ 465/2020లో అనంతపురం జిల్లాకు చెందిన ఇద్దరు నిందితులు ఏ-1 బోయ సుమంత్(28), ఏ-2 గోవర్ధన్(24)లను పీలేరు ఎస్ఐ తిప్పేస్వామి అరెస్ట్ చేశారన్నారు. తర్వాత పట్టణంలో జరిగిన 26 ద్విచక్రవాహన చోరీలకు సంబంధించి అప్పటి విచారణాధికారులు ఎస్ఐ వంశీధర్, జి.చంద్రమోహన్ కోర్టు ద్వారా పీటీ వారెంట్ పొంది వారిని రిమాండ్‌కు తీసుకుని చార్జ్‌షీట్ వేశారన్నారు. 23 నెలల అనంతరం శుక్రవారం మదనపల్లె కోర్టులో నిందితులపై నేరారోపణ రుజువు కావడంతో రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఇంటూరి ప్రవీణ్‌కుమార్ రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారన్నారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.ఉమాదేవి కేసును వాదించారన్నారు.

చీటీల వ్యాపారి టోకరా



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వచ్చిన బాధితులు

మదనపల్లె : మగ్గాలు నేసుకుంటూ, చీటీలు నిర్వహిస్తున్న ఓ వ్యక్తి కోటి రూపాయలకు పైగా అప్పు చేసి పరారయ్యాడు. దీంతో బాధితులు లబోదిబోమంటున్నారు. అప్పు ఇచ్చిన పలువురు చేనేత కార్మికులు, మగ్గాల యజమానులు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. అనంతరం వారు స్టేషన్ ఎదుట విలేకరులతో తమ గోడు వెల్లబోసుకున్నారు. పట్టణంలోని నీరుగట్టువారిపల్లె రాజానగర్‌కు చెందిన మధుసూధన్‌రెడ్డి మగ్గాలు నిర్వహిస్తూ.. చీటీల వ్యాపారం చేస్తుండే వాడు. చుట్టుపక్కల అందరితోనూ పరిచయాలు పెంచుకుని పలువురి వద్ద సుమారు కోటి రూపాయల వరకు అప్పు చేశాడు. మరికొందరు అతడి వద్ద చీటీలు వేశారు. ఇటీవల వ్యాపారంలో నష్టపోయానని, వడ్డీలు కట్టే స్థితిలో లేనని ఇల్లు అమ్మి చెల్లిస్తానని చెప్పడంతో నిజమేనని నమ్మి వేచి చూశారు. ఈ క్రమంలో ఎవరికీ తెలియకుండా ఇల్లు, ఇతర ఆస్తులను అమ్మివేసి, కుటుంబ సభ్యులతో సహా రాత్రికి రాత్రి ఊరు విడిచి వెళ్లిపోయాడు. తమకు న్యాయం చేయాల్సిందిగా వారు కోరారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణ చేస్తామని వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా తెలిపారు.

పరిశ్రమల స్థాపనతోనే జిల్లా అభివృద్ధి



మాట్లాడుతున్న జిల్లా జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాయచోటి : జిల్లా ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే పరిశ్రమల స్థాపన విరివిగా జరగాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీసీ హాల్‌లో 14వ జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి అవసరమైన ప్రోత్సాహం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజ, ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపక అధికారి అనిల్‌కుమార్, జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మీ, ఏపీఐఐసీ జెడ్ఎం, ఎఫ్ఐసీసీఐ సమన్వయకర్త రామకృష్ణ, దళిత సంఘ సమన్వయకర్త రాజశేఖర్, ఎల్‌డీఎం, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికల ఆవిష్కరణ

జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవ గోడపత్రికలను ఆవిష్కరించారు. జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జూలై 11న జరగబోవు ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ నెల 11న రాయచోటి పట్టణంలోని బస్టాండ్ కూడలి నుంచి బంగ్లా సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు డీఎంఅండ్‌హెచ్ఓ కొండయ్య తెలిపారు. అనంతరం ఎన్‌జీఓ హోమ్‌లో సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు.

సచివాలయాన్ని తనిఖీ చేసిన జేసీ

రామాపురం : మండలంలోని హసనాపురం పంచాయతీ పప్పిరెడ్డిగారిపల్లె గ్రామ సచివాలయాన్ని అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సచివాలయంలో పలు రికార్డులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ అరవింద్ కిషోర్, ఎంపీడీఓ హైదర్‌వలి, గ్రామ కార్యదర్శి ఓబులమ్మ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపాకలో ఘనంగా చక్రస్నానాలు



శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీదేవి, భూదేవిలకు పూజలు చేస్తున్న అర్చకులు



శ్రీ సిద్దేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారికి హారతి ఇస్తున్న దృశ్యం

రాజంపేట : తాళ్లపాకలో శుక్రవారం స్థానిక అన్నమాచార్య ధ్యానమందిర వేదిక వద్ద శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామికి చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. టీటీడీ అర్చకస్వాములు, వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య చక్రస్నానాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా అమ్మవార్లతో శ్రీ సిద్దేశ్వరస్వామి, శ్రీ చెన్నకేశవస్వాములకు పల్లకీసేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌరీశంకర్, టీటీడీ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ, టీటీడీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్య పరిష్కారం

రాయచోటి టౌన్ : జగనన్న సురక్ష కార్యక్రమంలో తమ గ్రామంలో తాగునీటి సమస్య ఉందని మాధవరం గ్రామం కస్బా ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యపై స్పెషల్ ఆఫీసర్ రాజశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ ప్రేమంత్‌కుమార్, ఎంపీడీఓ మల్‌రెడ్డిలు వెంటనే స్పందించి ఒక కమిటీని ఏర్పాటు చేసి సమస్యను విచారించి బోరు వేసి పైపులైన్ ద్వారా ప్రతి ఇంటికి వెళ్లే విధంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పోలుసుబ్బారెడ్డి, బీసీ నాయకులు పల్లపు రమేష్, హౌసింగ్ రూరల్ ఏఈ రామమోహన్‌రెడ్డి, ఏపీఐఐఎం డైరెక్టర్ శ్రీనివాసుల రెడ్డి, మాధవరం సర్పంచ్ షేక్ ఫాహీదా, పంచాయితీ కార్యదర్శులు పి. వెంకటరమణ, సహజీయా, ఎంపీటీసీ విశ్వనాథ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత హత్య కేసులో నిందితుల కస్టడీ పూర్తి

కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గత నెల 23న వైఎస్ఆర్‌సీపీ నేత సి.శ్రీనివాసులరెడ్డిని దారుణంగా హత్య చేసిన సంఘటనలో 26వ తేదీన ఆరుగురిని అరెస్ట్ చేశారు. వీరిలో ప్రతాప్‌రెడ్డి, ల్యాబ్ శ్రీనివాసులు, సురేష్‌కుమార్ అలియాస్ ఫ్రాన్సిస్‌లను విచారణ చేయాలని పోలీసులు కస్టడీకి కోరారు. ఈక్రమంలో వారిని నాలుగు రోజుల పాటు విచారణ చేసేందుకు మెజిస్ట్రేట్ అనుమతి ఇచ్చారు. ఈమేరకు నిందితులను ఈ నెల 4న పోలీసులు కస్టడీకి తీసుకుని విచారణ చేశారు. మరలా శుక్రవారం వారిని మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి, తరువాత కడప కేంద్ర కారాగారానికి రిమాండ్‌కు తరలించారు.

వైభవం..పుష్పయాగం



నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుష్పయాగం వైభవంగా జరిగింది. ఉత్సవమూర్తికి అర్చకులు వివిధ రకాల పూలతో పుష్పార్చన నిర్వహించారు. ధ్వజావరోహణంతో గురువారం బ్రహ్మోత్సవాలకు లాంఛనంగా ముగింపు పలికారు. శుక్రవారం పుష్పయాగం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, డిప్యూటీఈవో నటేష్‌బాబు, టీటీడీ సూపరింటెండెంట్ వెంకటేశ్వరయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టరు దిలీప్‌రాజు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు. – రాజంపేట

నందలూరు రైల్వే పూర్వ వైభవానికి కృషి



నందలూరు రైల్వేస్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి

నందలూరు(రాజంపేట) : నందలూరు రైల్వే పూర్వ వైభవానికి తన వంతు కృషి చేస్తానని, త్వరలో ఎంపీ మిధున్‌రెడ్డితో కలిసి రైల్వేకేంద్రం పరిశీలన ఉంటుందని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డిపల్లె అర్బన్ సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆహ్వానం మేరకు నందలూరు రైల్వేస్టేషన్ ఏరియా, బ్రిటిషు కాలం నాటి స్టీమ్ ఇంజన్‌లోకోషెడ్ దుస్థితిని ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నందలూరు రైల్వేకి ఎంతో ఘన చరిత్ర ఉందన్నారు. నందలూరులో రైళ్ల ఆపాలంటే అనేక కారణాలు ఉన్నతాధికారులు చూపుతున్నారన్నారు. ఇక్కడ అన్ని రకాల మౌలిక వసతులు, కావాలసిన భూములు, రెడిమేడ్ క్వార్టర్స్ ఉన్నాయన్నారు. మూతపడిన లోకోషెడ్ స్థానంలో ప్రత్యామ్నాయ పరిశ్రమ ఏర్పాటు చేస్తామని పదేళ్ల కిందట రాజ్యసభలో హామీ ఇచ్చారన్నారు. నందలూరులో రైళ్ల నిలుపుదలతోపాటు క్రూ సెంటర్ తరలిపోకుండా, కోవిడ్ ముందు ఏ రైళ్లకు హాల్టింగ్ ఉన్నాయో వాటిని పునరుద్ధరించాలన్నారు. తాను, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి కలిసి ఎంపీ మిథున్‌రెడ్డికి వివరిస్తామన్నారు. ఎంపీతో కలిసి రైల్వేబోర్డు అధికారులను కలిసి మాట్లాడుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గడికోట ఉషాసుబ్బారెడ్డి, జిల్లా వక్ఫ్‌బోర్డు సెక్రటరీ సయ్యద్‌అమీర్, మండల ఉపాధ్యక్షుడు నాయనపల్లె అనుదీప్, సౌమ్యనాథాలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, ఏజీపీ షమీ, మండల కో-ఆప్షన్ సభ్యుడు కలీం, మైనార్టీ నేత నవాబ్, నాయకులు ఆర్మగం విశ్వనాథ్, గుణయాదవ్, ఆకేపాటి రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 మల్టీడేస్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానం, కేఓఆర్ఎం క్రికెట్ మైదానం వేదికగా ఏసీఏ-అండర్-19 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ప్రారంభమైంది. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అనంతపురం జట్టు 72.1 ఓవర్లలో 397 పరుగులు చేసి ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 18 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసింది. జట్టులోని విజయ్ రామిరెడ్డి 5 ఫోర్లతో 23 పరుగులు చేశాడు. రణధీర్ 14 పరుగులతో క్రీజులో ఉన్నాడు. అనంత బౌలర్ లీలాసాయి 3 వికెట్లు తీశాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

ఆధిక్యంలో కర్నూలు

వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మరో మ్యాచ్‌లో కర్నూలు, చిత్తూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కర్నూలు జట్టు 85.2 ఓవర్లలో 284 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 2 ఓవర్లలో 12 పరుగులు చేసింది.